
సాక్షి
శ్రీకాకుళం
శనివారం ׀ 22 ׀ మార్చి ׀ 2025



ప్రిస్క్రిప్షన్ లేకుండా..
విజిలెన్స్ అధికారులు మెడికల్ షాపులు తనిఖీ చేశారు. చీటీ లేకుండా మందులు అమ్మరాదన్నారు. - 8లో



ఉగాది పురస్కారాలు
జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు ప్రకటించారు. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. - 8లో



ఇఫ్తార్	సహర్
శని (సా)	ఆది (ఉ)
6.10	4.42

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

65 ఏళ్ల వయసులో పరీక్ష కేంద్రానికి..




చదువుకు వయస్సు అడ్డురాదు. కొంత మందికి న్యాయ విద్యలో డిగ్రీ అన్నది దీర్ఘకాలిక కల. 65 ఏళ్ల వయస్సులో టీకే కళావతి అనే మహిళ శ్రీకాకుళంలోని ప్రైవేట్ న్యాయ కళాశాలలో ఐదేళ్ల ఎల్ఎల్‌బీ చదువుతున్నారు. ప్రస్తుతం ఈమె డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరీక్ష కేంద్రంలో మూడో సెమిస్టర్ పరీక్ష రాస్తున్నారు. ఈమెది తమిళనాడు రాష్ట్రం. బార్ కౌన్సిలాఫ్ ఇండియా నిబంధనలు మేరకు దేశంలో ఎక్కడైనా న్యాయ విద్య చదివే అవకాశం ఉంది. - ఎచ్చెర్ల క్యాంపస్

ఉద్దండపాలెం విద్యార్థికి కోటి రూపాయల కొలువు



సంతబొమ్మాళి మండలంలోని పాలతలగాం పంచాయతీ ఉద్దండపాలెం గ్రామానికి చెందిన ఆర్సీ విద్యార్థి హనుమంతు సింహాచలం భారీ ప్యాకేజీతో ఉద్యోగం సాధించాడు. విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఆర్‌ఎం) పూర్తిచేసిన సింహాచలం రూ. 1.3 కోట్ల వార్షిక ప్యాకేజీతో పోలాండ్‌కు చెందిన ప్రముఖ డెయిరీ సంస్థ కోవైస్కోలో హెచ్‌ఆర్ అసిస్టెంట్ ఉద్యోగం సంపాదించాడు. సింహాచలం తల్లిదండ్రులు హనుమంతు భీమారావు, కమల కుమారి వ్యవసాయం చేస్తుంటారు. సింహాచలం విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లో సాగింది. 2022 ఎంహెచ్‌ఆర్‌ఎం కోర్సులో చేరినప్పటి నుంచి అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సలహా మేరకు కమ్యూనికేషన్ స్కిల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాడు. 2024లో కోర్సు పూర్తయిన వెంటనే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో హిందుస్థాన్ ఫుడ్స్ లిమిటెడ్‌లో రూ.3.6లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అక్కడే పనిచేస్తూ మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలో పోలాండ్‌లోని డెయిరీ సంస్థ తమ హెచ్‌ఆర్ విభాగంలో పోస్టుల భర్తీకి యూనివర్సిటీ అధికారుల ను సంప్రదించగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తనకు సమాచారం ఇచ్చారని సింహాచలంతెలిపారు. ఇంటర్వ్యూ సక్సెస్ కావడంతో సంస్థ హెచ్‌ఆర్ అసిస్టెంట్‌గా ఎంపిక చేసింది. మే నెలలో విధులకు సిద్ధం కావాలని సమాచారం ఇచ్చిందని హనుమంతు సింహాచలం తెలిపారు. - సంతబొమ్మాళి



'నన్ను చూడగలవా..?' అంటూ ఓ బంకులో రీడింగ్ బోర్డు సవాల్ విసురుతూ ఉంటుంది. 'అంకెలు లెక్క పెట్టగలవా..?' అని మరో బంకులో రీడింగ్ చూపులకు అందనంత స్పీడులో పరుగులు పెడుతూ ఉంటుంది. 'ఏం పోశావురా.. బాబూ' అంటూ ఇంకో బంకులో ఆయిల్ పోసిన వెంటనే సైలెన్సర్ సాయంతో బండి ఏడుస్తూ ఉంటుంది. మోసపోవడం సామాన్యుడి జన్మహక్కు అన్నట్లు బంకుల యాజమాన్యాలు ప్రవర్తిస్తున్నాయి. రీడింగు నుంచి పెట్రోల్ నాణ్యత వరకు ఏదో ఒక దశలో మోసాలకు పాల్పడుతున్నాయి. వీరి వైఖరి వల్ల నిజాయితీగా ఉండే బంకులకు కూడా చెడ్డపేరు వస్తోంది. 'సాక్షి' శుక్రవారం నిర్వహించిన పరిశీలనలో పలు విషయాలు వెలుగు చూశాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మోసాల మీటర్
రయ్..రయ్..!

- పెట్రోల్ బంకుల్లో ఆగని మోసాలు
- అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రం
- డిజిటల్ మీటర్ నుంచి ఆయిల్ నాణ్యత వరకు అన్నింటా తప్పిదాలే

శ్రీకాకుళం పాతబస్టాండ్, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, పోలాకి, కవిటి:

మోటారు వాహనాల వినియోగం జిల్లాలో ఊహించని రీతిలో పెరిగింది. ఉద్యోగాలు, వ్యాపారాలు ఇతర అవసరాల వారు బైక్ లేనిదే బయట అడుగు పెట్టడం లేదు. ఈ-బైక్‌లు వచ్చినా ప్రజలు ఇంకా పెట్రోల్ బైక్‌లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. అయితే ఈ అవసరాన్ని కొందరు అవకాశంగా తీసుకుంటున్నారు. కొనుగోలుదారులను మోసం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. కొన్నేళ్ల కిందటి వరకు పెట్రోల్‌లో కిరోసిన్ పోసి కల్తీ చేసి అమ్మేవారు. కానీ ఇప్పుడా పద్ధతి పాతదైపోయింది. కొత్త కొత్త టెక్నిక్‌లు ఉపయోగించి మోసగిస్తున్నారు. సాంకేతిక సాయంతో ఏ మాత్రం అనుమానం రాకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు.

'సాక్షి' పరిశీలనలో తేలిన విషయాలు..

- శ్రీకాకుళం నగరం నడిబొడ్డున గల ఒక బంకు వద్ద ఫిల్టర్ పేపరుపై పెట్రోల్‌ను తనిఖీ చేయగా, కొద్ది నిమిషాల తర్వాత పేపర్‌లో మరక కనిపించింది. ఆయిల్ నాణ్యమైనది అయితే మరక ఉండకూడదు. కానీ ఇక్కడ ఆయిల్ కల్తీ జరుగుతున్నట్లు తెలిసింది.
- టెక్కలి శివారు ప్రాంతంలో గల ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ బాయ్ పెట్రోల్ కొట్టే క్రమంలో డిజిటల్ నంబర్లు ఒక్క సారిగా 1 నుంచి 55 నంబర్ల మధ్య జంపింగ్ జరుగుతోంది. నగరంలో ఏ పెట్రోల్ బంకులోనూ మౌలిక సదుపాయాలు లేవు.
- రాష్ట్ర సరిహద్దు పక్కనే ఉండడంతో పాతపట్నంలో ఎవరూ పెట్రోల్ కొనడం లేదు. అంతా ఒడిశాకే వెళ్తున్నారు. పాతపట్నం పెట్రోల్ బంక్ పెట్రోల్ నాణ్యంగా ఉండదని, ఆంధ్రా కంటే ఒడిశాలో తీసుకున్న పెట్రోల్ నాణ్యత బాగుంటుందని చెబుతున్నారు.
- పోలాకి మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో డిజిటల్ మీటర్ పనిచేయడం లేదు. అంకెలు కూడా సరిగా కనిపించడం లేదు.
- కవిటిలోని రెండు బంకుల్లో పెట్రోల్ నాణ్యంగా ఉండడం లేదని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఓ బంకులో డెన్సిటీ విషయంలో కూడా తేడాలు కనిపించాయి.



ఏదీ పర్యవేక్షణ..?

పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతలు మర్చిపోతున్నారు. ఈ బంకులపై సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, జేసీ, డీఎస్‌ఓలతో పాటు లీగల్ మెట్రాలజీ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ జిల్లాలో ఆ పర్యవేక్షణ ఉన్నట్లు కనిపించడం లేదు. బంకుల్లో తప్పనిసరిగా మౌలిక వసతులు ఉండాలి. కానీ చాలా బంకుల్లో అవి కనిపించవు.

ఇలా ఫిర్యాదు చేయండి..

పెట్రోల్ బంకుల్లో మోసాలు గమనిస్తే నిరభ్యంతరంగా ఫిర్యాదు ఇవ్వవచ్చు. ఆ మండలంలో ఉన్న సివిల్ సప్లై అధికారి, తర్వాత జిల్లా సప్లై ద్వారా, లేఖ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. న్యాయం జరగకపోతే జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చు. పెట్రోల్ బంకుల్లో సదుపాయాలు లేకపోయినా, సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా చమురు సంస్థలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ఇండియన్ ఆయిల్	18002333555
హెచ్‌పీసీఎల్	18002333555
భారత్ పెట్రోలియం	1800224344
రిలయన్స్	18008919023

నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ఇంధనం.. మోసాలే ఘనం..

- పెట్రోల్ బంకుల్లో చాలా విధాలుగా మోసాలు జరుగుతున్నాయి. కొన్ని బంకుల్లో నిజాయితీగా వ్యాపారం చేస్తున్నా.. చాలా బంకుల్లో మాత్రం బహిరంగంగానే మోసాలకు పాల్పడుతున్నారు.
- బంకుల్లో పంప్ నుంచి పెట్రోల్ విడుదల చేసే మిషన్ డిజిట్‌ను ఎక్కువగా వాడుతున్నారు. మీటరుపై చూపించే సరికే ఈ ఆయిల్ విడుదల జరుగుతోందని కొనుగోలుదారులు చెబుతున్నారు.
- ఈ డిజిటల్ మీటర్ ఫీడింగ్ ప్రైవేటు టెక్నీషియన్లతో చేయించుకుంటారు. పెట్రోల్ పంపింగ్ వేగం ఆధారంగా చేసే ఈ ప్రక్రియలో లోపాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.
- దీనికి తోడు పంపింగ్ జరిగినప్పుడు ఆ పంపు ఆపరేటర్ల చేతివాటం ఉంటుంది.
- పెట్రోల్ కల్తీ కూడా చాలా చోట్ల జరుగుతోంది. ట్యాంకులో పెట్రోల్‌ను ఫిల్లింగ్ చేసేటప్పుడు పెట్రోల్‌తో పాటు ఇథనాల్ కూడా వెళ్తుంది. దీంతో పెట్రోల్‌తో పాటు ఇథనాల్ కూడా పంపింగ్ జరిగి వాహనాలు పాడవటం, ఇంధనం తక్కువగా రావడం వంటివి జరగుతున్నాయి. ఎక్కువగా వర్షాకాలం శీతాకాలంలో ఈ సమస్యలు ఉంటాయి.
- ఇక బంకుల్లో ముందుగా చెల్లించిన డబ్బుకి ఫీడ్ చేసి ఆయిల్ కొడతారు. ఇక్కడ కూడా సాంకేతిక సాకుతో తప్పిదాలు జరుగుతున్నాయి.



పోలాకి బంక్‌లో పనిచేయని డిజిటల్ మీటర్

గడచిన ఆరు నెలల్లో కేవలం నాలుగు సార్లు మాత్రమే అధికారులు ఈ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్లను తనిఖీ చేయడం గమనార్హం.

13 బంకులపై కేసులు

జిల్లాలోని 90శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొలతల్లో తేడాలు ఉన్నట్లు సమాచారం. కొలతల వ్యత్యాసాలపై ఈ ఏడాది ఇప్పటి వరకు 13 కేసులు నమోదు చేశారు. తూనికల కొలతల్లో తేడాలను గుర్తించి కేసు నమోదు చేస్తే ఆ కేసు తేలేంత వరకు ఆ అధికారి రాష్ట్రంలో ఎక్కడ పనిచేస్తున్నప్పటికీ కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ కారణంగానే కేసుల నమోదు తగ్గించి అపరాధ రుసుంలతోనే సరిపెడుతున్నారు. ఫిర్యాదు దారుని సమక్షంలో కొలతలు తీసినప్పుడు, భారీ తేడాలు ఉన్నప్పుడు మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. కొలతల్లో తేడాల వలన వాహనదారులు పెట్రోల్ రూపంతో పాటు వాహన మన్నికల్లోను నష్టపోవాల్సి వస్తోంది.

> **తనిఖీలు నిర్వహించాలి**
>
> 
>
> పెట్రోల్ బంకుల్లో గల డిజిటల్ మెషీన్లతో వినియోగదారులు మోసపోతున్నారు. వినియోగదారులకు అందాల్సిన సేవల విషయంలో పూర్తిగా జాప్యం జరుగుతోంది. ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు చేయాలి. అలాగే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
> – చల్లా రామారావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధి, టెక్కలి

> **చట్టాలు కఠినంగా ఉన్నాయి**
>
> 
>
> బంకు యజమానులు మోసం చేస్తే, వెంటనే ఫిర్యాదు చేయాలి. సివిల్ సప్లై అధికారుల నుంచి వినియోగదారుల ఫోరం వరకు ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చు. చట్టాలు కూడా కఠినంగా ఉన్నాయి.
> – బగాది రామ్మోహన్ రావు, అధ్యక్షులు, జిల్లా వినియోగదారులు సమాఖ్య

జిల్లాలో పెట్రోల్ బంక్‌లు	పట్టణాలు, జాతీయ రహదారి ప్రాంతాల్లో ఉన్న ఒక్కో బంకులో రోజుకు విక్రయాలు (సుమారు)	గ్రామీణ ప్రాంతాల్లోని ఒక్కో బంకులో రోజుకు విక్రయాలు (సుమారు)	సగటున రోజుకు జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ వినియోగం	ఈ ఏడాది ఇంధనం మోసాలపై నమోదైన కేసులు
134	3000 లీటర్లు	2000 లీటర్లు	2.68 లక్షల లీటర్లు	13

పెట్రోల్‌ను ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, తక్కువ మోతాదులో వ్యవసాయ నీటి ఇంజిన్లకు వినియోగిస్తున్నారు.

- కుప్పిలి టెన్త్ పరీక్ష కేంద్రంలో చూసి రాస్తూ అధికారులకు దొరికిపోయిన విద్యార్థులు

చూచి రాతల
దోషి ఎవరు..?

విద్యాశాఖ చరిత్రలో సంచలనం
14 మంది టీచర్ల సస్పెన్షన్
5 మంది విద్యార్థుల డీబార్



కుప్పిలి మోడల్ స్కూల్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖలో సంచలనం నమోదైంది. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ ఏ,బీ కేంద్రాలుగా జరుగుతున్న పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో ఐదుగురు విద్యార్థులు డీబార య్యారు. జిల్లా చరిత్రలో ఓ పరీక్ష కేంద్రంలో ఒకే రోజు ఇంతమందిపై మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీనికి తోడు ఏకంగా 14 మంది టీచర్లను సస్పెండ్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఇంగ్లిషు పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 149 కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేటు కలిపి మొత్తం 28,323 పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 160 మంది గైర్హాజరయ్యారు.

ఏమైందంటే..?

కుప్పిలి ఏ, బీ కేంద్రాల్లో కాపీయింగ్‌పై నిఘా వర్గాల పక్కా సమాచారంతో అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. స్వయంగా డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యతోపాటు విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, ఎచ్చెర్ల ఎంఈఓ-2 గాలి రాజ్‌కిశోర్, లావేరు ఎంఈఓ-1 ఎం.వాగ్దేవిలు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో రెండు కేంద్రాల్లో యథేచ్ఛగా కాపీయింగ్‌లు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. తనిఖీ చేయగా రెడ్‌హ్యాండెడ్‌గా ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వీరిని డీబార్ చేశారు. కేంద్రాల సీఎస్‌లు, డీఓల ప్రోత్సాహంతో ఇన్విజిలేటర్ల వద్ద కూడా జవాబుపత్రాలు, జిరాక్స్ కాపీలు ఉన్నట్టు గుర్తించారు. కార్యాలయ సిబ్బంది, బయట నుంచి సహకరించిన వ్యక్తులను సైతం అధికారులు గుర్తించారు.

14 మంది టీచర్లపై వేటు

మొత్తం ఈ రెండు కేంద్రాల్లోని సీఎస్‌లు, డీఓలు, ఇన్విజిలేటర్లుగా ఉన్న ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై శాఖాపరమైన ఆదేశాలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. డీఈఓ కూడా నోట్ తయారు చేసి కలెక్టర్‌కు ఇచ్చారు. దీంతో కుప్పిలి ఏపీ మోడల్ స్కూల్ ఏ, బీ రెండు పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్లతో కలిపి మొత్తం 14 మంది ఉపాధ్యాయులు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఆదేశాలు జారీ చేశారు. ఇటు జిల్లాలో, అటు రాష్ట్రంలో పరీక్ష నిర్వహణలో భాగస్వామ్యమైన 14 మంది టీచర్లు ఏకకాలంలో సస్పెన్షన్‌కు గురికావడం చర్చనీయాంశమైంది. వీరిలో 11 మంది టీచర్లను డీఈఓ, ముగ్గురు హెచ్‌ఎంలను ఆర్జేడీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

కాపీ వెనుక ఉన్నదెవరు..?

గత ప్రభుత్వం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే కాపీయింగ్‌కు ప్రోత్సహిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సాధించిన ఫలితాల కంటే అధికంగా సాధించాలని విద్యాశాఖ మంత్రి ఆదేశించినట్టు భోగట్టా. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకే మాస్ కాపీయింగ్‌లు జరుగుతున్నాయని పరీక్ష కేంద్రాల్లో పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బంది చెబుతున్నారు. అధికారులు, స్క్వాడ్‌లు ఎంపికచేసుకున్న కేంద్రాల్లో మాత్రమే 'అతి'గా ఫోకస్ చేస్తున్నారని, మిగిలిన కేంద్రాల సంగతేంటని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

సస్పెండైన వారు వీరే..

1. కుప్పిలి బి-కేంద్రంలో సీఎస్‌గా వ్యవహరించిన పీవీ దుర్గారావు-హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరాయునిపాలెం (లావేరు మండలం)
2. కుప్పిలి ఏ- కేంద్రంలో సీఎస్‌గా వ్యవహరించిన ఎం.లక్ష్మణరావు-హెచ్‌ఎం, జెడ్పీహెచ్ స్కూల్ కొత్తపేట (ఎచ్చెర్ల మండలం)
3. కుప్పిలి బి-కేంద్రం డీఓగా వ్యవహరించిన బీవీ సాయిరాం (ఎస్‌ఏ మ్యాథ్స్), జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట (ఎచ్చెర్ల మండలం)
4. కుప్పిలి ఎ-కేంద్రం డీఓగా వ్యవహరించిన పి.హరికృష్ణ (ఎస్‌ఏ), జెడ్పీహెచ్‌స్కూల్ ధర్మవరం (ఎచ్చెర్ల మండలం)
5. జె.పద్మకుమారి- హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌స్కూల్ కుప్పిలి
6. ఎం.కనకరాజు (ఎస్‌ఏ ఇంగ్లీషు)-జెడ్పీహెచ్‌స్కూల్ బుడగట్లపాలెం
7. ఎస్.కృష్ణ (ఎస్‌ఏ హిందీ) జెడ్పీహెచ్‌స్కూల్ కొయ్యాం
8. పి.నాగేశ్వరరావు (ఎస్‌ఏ మ్యాథ్స్) జెడ్పీహెచ్‌స్కూల్ కుప్పిలి
9. కె.కామేశ్వరరావు (ఎస్‌ఏ హిందీ) జెడ్పీహెచ్ స్కూల్ కుప్పిలి
10. కారు కస్టోడియన్ కమ్ సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించిన ఎంవీ కామేశ్వరరావు (ఎస్‌ఏ) జెడ్పీహెచ్‌స్కూల్ అదపాక (లావేరు మండలం)
11. ఏ.శ్రీరాములునాయుడు (ఎస్‌ఏ తెలుగు) జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరాయునిపాలెం
12. ఎస్.శ్రీనివాసరావు (ఎస్‌ఏ మ్యాథ్స్), ఎంపీయూపీ స్కూల్ బడివానిపేట
13. బి.రామ్మోహనరావు (ఎస్‌ఏ మ్యాథ్స్), జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరాయినిపాలెం
14. పి.ఫల్గుణరావు (ఎస్‌ఏ పీఈ), జెడ్పీహెచ్ స్కూల్ మురపాక.

పైడిభీమవరం హైస్కూల్‌లో సీసీ కెమెరాలు చోరీ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8 సీసీ కెమెరాలు, వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల కిందట దొంగిలించారు. ఈ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. దీనిపై పాఠశాల సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్సై చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిద్దాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన ది వ్యాంగుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలిసి వినతులు స్వీకరించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ శ్రీకాకుళం కార్యాలయ అధికారులు, సిబ్బంది దరఖాస్తుదారులను కూర్చోబెట్టి మంచి నీళ్లు, టీ, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ పాల్గొన్నారు.



ఖాళీబిందెలతో మహిళల నిరసన

వంశధార గట్టు..
నీరు దొరికితే ఒట్టు



హిరమండలం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న మహిళలతో మాట్లాడుతున్న ఎస్సై యాసిన్

హిరమండలం: అక్కడ రోజూ 'పానీ'పట్టు యుద్ధమే. ఊరు వంశధార గట్టు కిందే ఉన్నా.. నీటి బొట్టు కూడా దొరకని వింత పరిస్థితి వారి ది. వేసవి కాలం వచ్చిందంటే బిందెలు పట్టుకుని గంటల కొద్దీ వేచి ఉండాల్సిన దుస్థితి. చుక్క చుక్క నీటి బొట్లు రాలుస్తూ వెక్కిరించే కుళాయిలు, ఎప్పుడు వస్తాయో తెలీని ట్యాంకర్లపై విసుగెత్తిపోయిన హిరమండలం మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలు పట్టుకుని అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై నిరసన తెలిపా రు. రహదారి గుండా ఎలాంటి వాహనాల రాకపోకలు జరగకుండా అడ్డుకున్నారు. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు.

హిరమండలం మేజర్ పంచాయతీలో సుమారు 18 వేల మంది జనాభా ఉంది. ప్రతి మనిషికి రోజుకు సగటున 20 లీటర్ల నీరు అవసరం. ఈ లెక్కన 3,60,000 లీటర్ల నీరు అందించాల్సి ఉంటుంది. కానీ ఎప్పుడో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన పైపులైన్, మంచినీటి పథకం సామర్థ్యం చాలడం లేదు. అటు సమగ్ర మంచినీటి పథకం, జలజీవన్ మిషన్ వంటి పథకాలు ఉన్నా ఏవీ అక్కరకు రావడం లేదు. వేసవికి ముందస్తు చర్యలు లేవు. ఇటీవల ఒకే సారి నీటికి ఇబ్బందులు రావడంతో అప్పటికప్పుడు బోర్లు తవ్వి పథకానికి అనుసంధానం చేశారు. అయినా తాగునీరు అందని దుస్థితి. కుళాయిల ద్వారా అంతంత మాత్రమే నీరు అందిస్తున్నారు. రోజు విడిచి రోజు నీరు రావడంతో మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఉంటుందని తెలిసినా ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై వారు మండిపడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావిస్తే మేజర్ ఇప్పటికే అదనంగా బోర్లు తవ్వామని వాటి నుంచి నీటిని పథకానికి అనుసంధానం చేస్తామని చెప్పారు.

> **పాలకుల్లో చలనం లేదు..**
>
> 
>
> అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకుల్లో చలనం లేదు. దీంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు. నది పక్కన ఉన్నామే తప్ప నీరు మాత్రం లేకుండా పోతోంది.
> – ఇద్దుబోయిన ఆదిలక్ష్మి, హిరమండలం

> **గుక్కెడు నీటి కోసం ..**
>
> 
>
> ఏటా వేసవి వచ్చిందంటే చాలు.. తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడతాం. నది చెంతనే ఉన్నామన్న మాటే కానీ.. గుక్కెడు నీటి కోసం కూడా పాట్లు పడాల్సిన పరిస్థితి.
> – కొటివాడ లీలావతి, స్థానిక మహిళ, హిరమండలం

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



విజేతలతో డీఎఫ్‌వో వెంకటేష్ తదితరులు

అరసవల్లి: విద్యార్థి దశ నుంచే అడవులు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అటవీ శాఖాధికారి శంబంగి వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని అరణ్య భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు ర్వహించారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన కె.షర్మిళకు ప్రథమ బహుమతి, టీపీఎం పాఠశాలకు చెందిన నూకరాజుకు ద్వితీయ బహుమతి, ఏపీఎస్ పాఠశాలకు చెందిన శ్రీవల్లి, భరత్‌లకు తృతీయ బహుమతులు లభించాయి. వీరికి డీఎఫ్‌వో వెంకటేష్, ఏపీఎస్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావులు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.

ఉపఖజానా అధికారిగా పదోన్నతి



జి.వి.ఎస్.ఎస్.మూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జోన్–1 ఖజానా శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురు సీనియర్ అకౌంటింగ్ అధికారులకు ఉప ఖజానా అధికారులుగా పదోన్నతి లభించింది. వీరిలో జిల్లా ఖజానా కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జి.వి.ఎస్.ఎస్.మూర్తిని పార్వతీపురం మన్యం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉప ఖజానా అధికారిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎముకల విభాగాధిపతిగా డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్



శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి ఎముకల విభాగాధిపతిగా డాక్టర్ లూకలాపు ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన డాక్టర్ ధర్మారావు ఉద్యోగ విరమణ చేయడంతో ప్రసన్నకుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించగా రెగ్యులర్ హెచ్‌ఓడీగా బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ పేడాడ రాము పిల్లల విభాగాధిపతిగా నియమితులయ్యారు. ఆయన కూడా ప్రస్తుతం రెగ్యులర్ హెచ్‌ఓడీగా బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్‌శాఖ ఏఈలకు పదోన్నతులు

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలోని శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో ఏఈలుగా పనిచేస్తున్న పలువురు ఇంజినీర్లకు డిప్యూటీ ఈఈ క్యాడర్‌లో పదోన్నతులు కల్పిస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కోటబొమ్మాళి ఏఈగా పనిచేస్తున్న జి.వి.సురేష్‌కు నరసన్నపేట ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా, ఎంఆర్‌టీ ఏఈగా పనిచేస్తున్న టి.వి.శంకర్ శ్రీనివాస్‌కు సీటీఎం శ్రీకాకుళం డిప్యూటీ ఈఈగా, విశాఖపట్నం మురళీనగర్‌లో ఏఈగా పనిచేస్తున్న ఎం.రాజేష్‌కు రణస్థలం ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా పదోన్నతులు కల్పించారు. ఇంతవరకు నరసన్నపేట డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న కె.ఇందిరకు టీఆర్ఈ శ్రీకాకుళం డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు.

జిల్లా పోలీసులకు.. ఉగాది పురస్కారాలు

- శ్రీకాకుళం ఒకటో పట్టణ ఏఎస్‌ఐకి ఉత్తమ సేవా పతకం
- విజిలెన్స్‌లో ముగ్గురికి, ఫైర్ విభాగంలో ముగ్గురికి పతకాలు



వి.నేతాజీ, ఎస్ఐ, డీటీఆర్బీ



ఎస్.గపూర్, ఎస్ఐ, సీసీఎస్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసులు వారి సర్వీసులో కనబర్చిన అత్యుత్తమ ప్రతిభకు గాను ఉగాది – 2025 పురస్కారాల్లో సేవా పతకాల పంట పండింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఆదేశాలతో రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి శుక్రవారం వెలువడ్డాయి.

సేవా పతకాలు వరించిన వారిలో..

జిల్లా ట్రాఫిక్ రికార్డ్ బ్యూరో (డీటీఆర్బీ) ఎస్ఐ వి.నేతాజీ, సీసీఎస్ ఎస్ఐ ఎస్ గపూర్, ఓడలరేవు(మెరైన్) సీఎస్‌పీఎస్ ఎస్ఐ జి.విలియమ్స్, ఏఆర్ ఏఎస్ఐ వై.రామారావు, ఏఆర్ హెచ్‌సీ సీహెచ్ విశ్వనాథం, జి.సిగడాం హెచ్‌సీ కె.నాగేశ్వరరావు, సీసీఎస్ పీసీ ఎ.విశ్వనాథం, ఏఆర్ పీసీ ఆర్.మీరాబాబు, భావనపాడు సీఎస్‌పీఎస్ పీసీ యు.లక్ష్మీపతి ఉన్నారు.

జిల్లా అగ్నిమాపక విభాగంలో..



బి.సోమేశ్వరరావు, పలాస ఫైర్‌స్టేషన్ అధికారి



బి.శృంగారినాయుడు, లీడింగ్‌ఫైర్‌మ్యాన్



షేక్ రహీమ్, డ్రైవింగ్ ఆపరేటర్

పలాస స్టేషన్ అధికారి బి.సోమేశ్వరరావు, శ్రీకాకుళం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మేన్ బి.శృంగారి నాయుడు, డ్రైవింగ్ ఆపరేటర్ షేక్ రహీమ్‌లకు సేవా పతకాలు వరించాయి.

రమేష్‌బాబుకు ఉత్తమ సేవా పతకం..



శ్రీకాకుళం ఒకటో పట్టణ ఏఎస్ఐ బి.రమేష్‌బాబుకు ఉత్తమ సేవా పతకం దక్కింది. 1990 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన రమేష్ బాబు 2011లో హెచ్‌సీగా, 2017లో ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. 2024లో కూడా సేవాపతకం వరించింది.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో..



ఎస్.అశోక చక్రవర్తి, విజిలెన్స్ ఎస్ఐ



ఇజ్జాడ ఈశ్వరరావు, విజిలెన్స్ పీసీ



పి.లక్ష్మీనారాయణ, విజిలెన్స్ పీసీ

ఎస్ఐ ఎస్.అశోక చక్రవర్తి, కానిస్టేబుళ్లు ఇజ్జాడ ఈశ్వరరావు, పి.లక్ష్మీనారాయణలకు ఏపీ పోలీస్ సేవా పతకాలు వరించాయి.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దు

- విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు
- ఏకకాలంలో తొమ్మిది మెడికల్ షాపుల్లో విజిలెన్స్ దాడులు



జిల్లాకేంద్రంలో మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్/పాతపట్నం/హిరమండలం : వైద్యులిచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మినా.. గడువు ముగిసిన మందులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మెడికల్ దుకాణదారులను హెచ్చరించారు. శుక్రవారం జిల్లాలో ఏకకాలంలో తొమ్మిది మెడికల్ షాపుల్లో విజిలెన్స్, డ్రగ్ కంట్రోల్, ఈగల్ టీమ్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు.

ఎక్కడెక్కడ అంటే..

శ్రీకాకుళం కేంద్రంగా డేఅండ్‌నైట్ సమీప శ్రీనివాస మెడికల్స్, అమరావతి మెడికల్స్, ఇలిసిపురం రైతు బజారు సమీప మహలక్ష్మి మెడికల్స్, గుజరాతీపేట కూడలి సమీప నీలిమ మెడికల్స్, యునైటెడ్ మెడికల్స్ (చిత్తరంజన్ వీధి), పలాసలో తర్లాన వాసుదేవరావు మెడికల్స్, కాశీబుగ్గలో శ్రీ మెడికల్స్, పాతపట్నంలో మధు మెడికల్స్, హిరమండలంలో విజయశంకర్ మెడికల్స్ దుకాణాల్లో రాత్రి తొమ్మిది గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. గుజరాతీపేట నీలిమ మెడికల్స్‌తో పాటు పలాస, కాశీబుగ్గ, పాతపట్నం, హిరమండలం మెడికల్స్‌లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలు, గడువు దాటిన మందుల అమ్మకాలు జరిగినట్లు గుర్తించారు. మిగతా చోట్ల చిన్న చిన్న లోపాలున్నట్లు గుర్తించి సరిచేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం సరిలేనివారు, నిద్రపట్టని వారికి ఇచ్చే మందులకు ప్రిస్క్రిప్షన్ ఉన్నవీ లేనివీ గుర్తించమని డీజీ హరీష్‌కుమార్ నుంచి ఉత్తర్వులు రావడంతో ఈ దాడులు జరిపామన్నారు. సైక్రియాట్రిక్, హ్యాబిక్యులర్, షెడ్యూల్డ్– హెచ్ డ్రగ్‌లు ఈ జాబితాలోకి వస్తాయని వివరించారు. ఈయనతో పాటు జిల్లా డ్రగ్ కంట్రోలర్ ఏడీ చంద్రరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాయుడు, విజిలెన్స్ ఎస్ఐ అశోక చక్రవర్తి,.హెచ్‌సీ కామేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దాడులు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు పాతపట్నం మండల కేంద్రంలోని పలు మందుల దుకాణాలను యాజమానులు ముందుగానే మూసివేశారు.

రచ్చబండ ధ్వంసంపై ఆరా



రచ్చబండ వద్ద కొలతలు తీస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన రచ్చబండను టీడీపీ నాయకుడు అధికార అహంతో కూలదోస్తున్నట్లు గురువారం సాక్షి దినపత్రికలో 'రెచ్చిపోయిన పచ్చ తమ్ముడు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు శుక్రవారం వీఆర్వో రాజారావు, విలేజ్ సర్వేయర్ మీనాకుమారీలు కె.శాసనాం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. తన సొంత ఆస్తికి ఎదురుగా రచ్చబండ ఉండటంతో దాన్ని అడ్డు తొలగించేందుకు కూలదోసినట్లు అధికారుల ఎదుట టీడీపీ నాయకుడు ఇసురు ఫకీరు ఒప్పుకున్నాడు. గ్రామస్తుల సమక్షంలో కొలతలు తీయడంతో అసలు రహస్యం బట్టబయలైంది. రచ్చబండతో పాటు మరో పది అడుగుల వరకు ప్రభుత్వ పోరంబోకు స్థలం ఉందని, రచ్చబండను తొలగించే అధికారం ఫకీరుకు గానీ, వారి కుటుంబ సభ్యులకు లేదని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్తులు సైతం పచ్చ తమ్ముడికి చీవాట్లు పెట్టడంతో వెనుదిరిగాడు.

రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు రేపు

టెక్కలి: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రగ్బీ జిల్లా జట్లు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రామకృష్ణ, పి.పార్వతీశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, పురుషుల జట్లు సంబంధించి ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8500007272, 7842423423 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఢిల్లేంద్ర(ఫైల్)

నందిగాం: మండలంలోని హరిదాసుపురం గ్రామానికి చెందిన అక్కురాడ ఢిల్లేంద్ర(35) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నందిగాం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కురాడ కరువులుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఢిల్లేంద్ర జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న తమ్ముడు భుజంగరావును ష్యూరిటీగా పెట్టి భార్య సుశీల పేరిట రూ.3 లక్షల లోన్ తీసుకున్నాడు. కొద్ది రోజులుగా లోన్ డబ్బులు కట్టకపోవడంతో కుటుంబంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య సుశీల సారవకోట మండలం కుమ్మరిగుంటలో ఉన్న కన్నవారింటికి వెళ్లిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఢిల్లేంద్ర శుక్రవారం ఉదయం టెక్కలి వెళ్లాడు. అటు నుంచి బస్సులో బెండిగేటు వరకు టికెట్ తీసుకొని తురకల కోట వద్ద దిగాడు. అక్కడినుంచి మాదిగాపురం సమీపంలో ఉన్న తమ జీడి తోటకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనా స్థలంలో హిట్ దోమల కాయిల్స్, మద్యం బాటిల్ ఉండటంతో మందులో కాయిల్స్ కలిపి తాగి ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి తమ్ముడు తోటలో జీడి పిక్కలు ఏరేందుకు వెళ్లగా అక్కడ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలియజేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి



చిత్తిరి ఆర్య (ఫైల్)

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన చిత్తిరి ఆర్య (21) శుక్రవారం రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్య వ్యక్తిగత పనిపై శుక్రవారం చీపురుపల్లిలో రైలు ఎక్కి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ వెళ్లాడు. అక్కడి నుంచి జాజ్‌పూర్ వెళ్లేందుకు రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుడి దగ్గరున్న ఆధార్ కార్డు, ఫోన్ సహాయంతో అక్కడి రైల్వే పోలీసులు విజయవాడలో ఉంటున్న తల్లిదండ్రులు బుజ్జి, మహాలక్ష్మిలకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన బుడితికి చెందిన కొందరితో కలిసి భువనేశ్వర్ బయల్దేరారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ దగ్ధమైంది. సింగన్నపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ నారాయణపురం జంక్షన్ వైపు నుంచి గడ్డి లోడుతో విశాఖ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గడ్డి కుప్పకు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు వచ్చి మంటలు అదుపు చేశారు. ట్రాక్టర్ ఇంజిన్ నుంచి ట్రాలీ వేరు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఫీజుల వసూలుపై ఫిర్యాదు



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, విద్యార్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలిలో ఓ కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి ప్రభుత్వ నిబంధనలు, సూచనలకు వ్యతిరేకంగా ఫీజు వసూలు చేస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ప్రతినిధులు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు ఆయన చాంబర్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని, విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని ఇటీవల ప్రకటన చేశారని, అయితే ఆ కళాశాల యాజమాన్యం ఆ ప్రకటన నమ్మడం లేదని, సకాలంలో ఫీజులు కట్టలేని వారికి ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది చదువులు పూర్తయినా డబ్బులు చెల్లించలేదంటూ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. పూర్తి ఫీజులు కట్టిన వారికే హాల్‌టికెట్లు ఇస్తున్నారని తెలిపారు.జిల్లాలో పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అనంతరం డీఆర్‌వో సంబంధిత కళాశాల డైరెక్టర్‌తో మాట్లాడి ఆరా తీశారు.

టీడీపీ కార్యకర్త దౌర్జన్యం!



జేసీబీతో స్థలాన్ని చదును చేయిస్తున్న దృశ్యం

- ఆమదాలవలస పట్టణంలో స్థలం ఆక్రమణకు యత్నం
- సర్వే చేసిన అధికారులు



స్థలం కాగితాలు చూపిస్తున్న బాధితుడు వెంకటరమణ

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో ప్రధాన రహదారిని ఆనుకుని రామమందిరం సమీపంలో సర్వే నంబర్ 135లో ఉన్న స్థలాన్ని టీడీపీ కార్యకర్త ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని బాధితుడు పుల్లేటికుర్తి వెంకటరమణ వాపోయారు. శుక్రవారం ఉదయాన్నే జేసీబీ, ట్రాక్టర్లు వచ్చి స్థలం చదును చేసి కబ్జాకు ప్రయత్నం చేసినట్లు విలేకరులకు తెలియజేశారు. పోలీసులను ఆశ్రయించి తవ్వకాలను నిలిపివేయించినట్లు చెప్పారు. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ఎప్పటికప్పుడు ఇలా ఆక్రమణకు వస్తున్నాడని, జనవరి 19న కూడా ఇలాగే జేసీబీతో వచ్చి బెదిరించి మిద్దెను కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.2024లో రిజిస్ట్రేషన్ చేశారని ఆక్రమణదారుడు చెబుతున్నా అంతకుముందే 2023లో తన పేరిట రిజిస్ట్రేషన్ చేసిన అసలు పత్రాలు ఉన్నాయని వెంకటరమణ చెప్పారు. స్థలం నుంచి తప్పుకోకుంటే హతమారుస్తానని బెదిరిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అండదండలు ఉన్నాయని, తనను ఎవరు ఆపేది లేదంటూ వేధిస్తున్నాడని వాపోయారు. ఈ విషయమై న్యాయ పోరాటం చేస్తానని వెంకటరమణ తెలిపారు. కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీస్, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు సిబ్బందితో కలిసి స్థలానికి కొలతలు వేశారు. ఈసీ ఎవరి పేరిట వస్తుందో దాని ప్రకారం డాక్యుమెంట్ అందిస్తామని పోలీసులకు వివరించి వెళ్లిపోయారు.

లారీ చోరీకి విఫలయత్నం



చోరీకి గురైన లారీ

ఇచ్ఛాపురం: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పార్కింగ్ చేసిన లారీని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. సకాలంలో పోలీసులు రంగంలోకి దిగడంతో తిరిగి లారీని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం లారీ కోసం వచ్చిన యజమాని పైల వాసుదేవరావుకు పార్కింగ్ ప్రదేశంలో వాహనం కనిపించలేదు. తోటి డ్రైవర్లను, చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లారీ యజమాని ఫిర్యాదుచేశాడు. పట్టణ ఎస్సై ముకుందరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఒడిశా పరిధిలోని పితాతోళి గ్రామంలో లారీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చోరీకి పాల్పడింది కటక్ చెందిన వ్యక్తిగా అనుమానించి నిందితుడిని అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు

కంచిలి: కంచిలి జాతీయ రహదారిలో పబ్జీ దాబా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. కంచిలి పంచాయతీ పరిధి బలియాపుట్టుగ కాలనీకి చెందిన జగన్నాథంరాజు, గేదెల దేవరాజు, జంగాల జగన్నాథంలు శుక్రవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పబ్లిసిటీ పెయింటింగ్స్ రాసేందుకు ఆటోలో మందస బయలుదేరారు. కంచిలి జాతీయ రహదారిలో పబ్జీ దాబా వద్దకు వచ్చే సరికి కుక్కలు ఎదురుగా రావడంతో పాటు అప్పటికే మద్యం మత్తులో ఉన్న జగన్నాథం రాజు అజాగ్రత్తగా ఆటో నడపడంతో అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు స్పందించి ముగ్గురిని 108 అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గేదెల దేవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు ఆటో నడుపుతున్న జగన్నాథం రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసగించిన యువకుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం: యువతిని మోసగించిన కేసులో దేవరవలస గ్రామానికి చెందిన సిగటాపు కిరణ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రణస్థలం సీఐ అవతారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవరవలసకు చెందిన కిరణ్ అదే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతిని పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు కోరడంతో నిరాకరించాడు. పెద్దలను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితురాలు ఈ నెల 19న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ వై.మధుసూదనరావు, ఏఎస్ఐ కె.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



బుడతవలస, తామాడ పరిధిలో భూములను పరిశీలిస్తున్న తహశీల్దార్, సిబ్బంది

ఎచ్చెర్ల: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలని లావేరు తహశీల్దార్ జోగారావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తామాడ, బుడతవలస పంచాయతీల రెవెన్యూ పరిధిలో అక్రమంగా చదును చేస్తున్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదునుచేసిన భూముల్లో సర్వే చేపట్టి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈయనతో పాటు ఆర్ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గెద్దలపాడులో విచారణ

సంతబొమ్మాళి: మండలం లక్కివలస పంచాయతీ గెద్దలపాడు గ్రామంలో డీఐఓ డాక్టర్ రామదాస్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఆశ వర్కర్‌గా కొనసాగడానికి గ్రామ పెద్దలు డబ్బులు ఇవ్వాలని అడిగారని, తాను నిరాకరించడంతో వెలివేశారని ఆశ వర్కర్ ఎస్.చంద్రమ్మ విచారణ అధికారికి తెలియజేశారు. గ్రామంలో ఆశ వర్కర్ సరిగా మందులు ఇవ్వడం లేదని, ఆ స్థానంలో వేరొకరిని నియమించాలని గ్రామ పెద్దలు విచారణ అధికారులకు తెలియజేశారు. వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసి డీఎంహెచ్ఓ, కలెక్టర్‌కు నివేదిక అందజేయడం జరుగుతుందని, తదుపరి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని డీఐఓ డాక్టర్ రామదాసు తెలిపారు.

ఇసుక రేవులో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ జనార్దన

గార: మండలంలోని కళింగపట్నం పంచాయతీ సిలగాం జీడి తోటల సమీపంలో ఇసుక రేవు(లంక భూములు)లో గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆర్.జనార్దన, పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, ఇసుక గోతుల్లో కర్రపై మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. నీలం నిక్కరు, చిన్న గడులు ఉన్న షర్ట్‌తో మృతదేహం ఉందన్నారు. చేతిలో దుస్తులు, చెప్పులుతో పాటు మూడు రోజుల కిందట ప్యాక్ చేసిన ఆహార పొట్లం ఉందని చెప్పారు. మృతదేహాన్ని పంచనామా కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.